క్లుప్తంగా

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు



శాయంపేట : మండల కేంద్రంలోని మాజీ వార్డు సభ్యుడు బాసాని చంద్రమౌళి ఇంటి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్‌కు జాయింట్ వద్ద లీకేజీ ఏర్పడగా గేట్ వాల్ ఆపరేటర్ ద్వారా తెలుసుకున్న కాంట్రాక్టర్ సిబ్బందితో శనివారం మరమ్మతులు చేయించారు. ఇటీవల వేసిన సీసీ రోడ్డు కింద ప్రధాన పైప్‌లైన్ జాయింట్ చేసి లీకేజీ గుర్తించి సీసీ రోడ్డుకు ఆటంకం కలగకుండా కింది భాగంలో జేసీబీతో తవ్వకాలు నిర్వహించి ఎట్టకేలకు జాయింట్ వద్ద పైపుకు మరమ్మతు చేశారు. పైప్‌లైన్‌కు మరమ్మతు చేయడంతో యాదావిధిగా తాగునీటి సరఫరా కొనసాగింది.

'మత్స్య' సొసైటీ ఎన్నికల బరిలో 39 మంది



జాబితా చూపుతున్న ఎన్నికల అధికారి

శాయంపేట : మండలంలోని పెద్ద కోడెపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల బరిలో 39 మంది అభ్యర్థులు నిలిచినట్టు ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగగా 42 మందిలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎన్నికల చిహ్నాలతో కూడిన, బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు గాను 39 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు ప్రకటించారు. తుది జాబితాను ఎన్నికలు నిర్వహించనున్న పెద్దకోడెపాకలోని రైతు వేదిక గోడలకు అతికించారు.

'బీజేపీ వ్యాఖ్యల్లో నిజం లేదు'

భీమదేవరపల్లి : బీజేపీ నాయకులు చెప్పే మాటల్లో నిజం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్పాట మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముల్కనూర్ గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులే అక్రమ వ్యాపారాలు సాగిస్తూ అసత్య ప్రచారాలు చేస్తుండగా ఆ పార్టీ నాయకుడు బొమ్మ శ్రీరాం మాత్రం అనవసరమైన మాటలు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను విమర్శించడం సరికాదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై బీజేపీ అర్థరహిత చేయొద్దని హితవు పలికారు. లేనిపక్షంలో బీజేపీ నాయకులకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



ఐనవోలు : తాటిచెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కులవృత్తిలో భాగంగా గీతకార్మికుడు నకరకంటి రాజయ్య(48) శుక్రవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు, కుటుంబీకులు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రాజయ్య మృతదేహానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి, పాపన్న సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ శనివారం నివాళులర్పించారు. గీత కార్మికుల కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రతినెల రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని రాజు, యాదగిరి డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా నాయకుడు తండా వెంకన్న, తీగల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు పట్టాపురం ఎల్లాగౌడ్, నకరకంటి మోహన్, గడ్డం రమేష్, మునిగాల సదానందం, బి.పరమేష్, ఎం.సంపత్‌కుమార్, తదితరులున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు



పరకాల : పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పరకాలకు చెందిన మేకల రాజు, ఎండి.జెన్నీఫర్, ఆకుల రాజు, సామ రవిలకు పరకాల మెజిస్ట్రేట్ శాలినీ లింగం ఐదు రోజుల జైల్ శిక్షతోపాటు రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. చాలా రోజుల తర్వాత డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష మొదలు కావడంతో మందుబాబులు అదుపులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాలువల నిర్మాణంలో నాణ్యతాలోపం

ఆత్మకూరు : మండల కేంద్రంలో పునరుద్ధరిస్తున్న పంట కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం కనపడుతోందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం పంట కాలువ నిర్మాణ పనులను శనివారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. పంట కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. నాణ్యత పాటించాలని కోరారు. నిధులను దుర్వినియోగం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ సెల్ నాయకుడు వంగాల బుచ్చిరెడ్డి, నాయకులు ఎదులాపురం శ్రావణ్‌కుమార్, వేణు, బయ్య పైడి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఆందోళనలు తప్పవు : కాంగ్రెస్

మండల కేంద్రంలో చేపట్టిన పంట కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యతను విస్మరిస్తే ఆందోళనలు తప్పవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం కాలువ పనులను సందర్శించి పరిశీలించింది. అనంతరం రమేష్ మాట్లాడారు. నాణ్యత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు, బీసీ సెల్ నాయకుడు పూజారి రాము, ఎంపీటీసీ రజనీకర్‌రెడ్డి, అలువాల రవి, ముద్దం సాంబయ్య, సందీప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరక్షిత లైంగిక సంబంధాలతో హెచ్‌ఐవీ

శాయంపేట: హెచ్‌ఐవీ కలిగిన వ్యక్తితో అరక్షిత లైంగిక సంబంధాలతో ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్ (డీఆర్పీ) జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను సర్పంచ్ కందగట్ల రవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్పీ జ్యోతి మాట్లాడారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. హెచ్‌ఐవీ పరీక్ష ఫలితాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా బాధితులకు ఏఆర్టీ మందులను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. బాధితులు జీవితకాలం మందులు వాడాల్సి ఉంటుందని చెప్పారు. సుఖ వ్యాధులు, క్షయ, రక్తదానం తదితరాల గురించి అవగాహన కల్పించారు. క్యాంప్‌లో 123 మందిలో 98 మంది రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, జోనల్ సూపర్‌వైజర్ కుమారస్వామి, లింక్ వర్కర్ స్వప్న, ఆశవర్కర్ ప్రేమలత పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, డీఆర్పీ

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శాయంపేట : మండలంలోని పలు గ్రామాల్లో నేడు (ఆదివారం) చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొంటారని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

భీమదేవరపల్లి : భక్తిభావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని శ్రీ దత్తసాయి ఆలయ క్షేత్రం 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. తొలుత ఆలయంలో సుప్రభాత సేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ పొన్నాల హేమలత, ఎంపీటీసీ మండల సురేందర్, నాయకులు మాడిశెట్టి తారాబాయి, చందుపట్ల రాజిరెడ్డి, మ్యాకల వెంకన్న, భూపతి సుధాకర్, అర్చకుడు కోటి తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

నేత్రాల సంరక్షణ కీలకం



శాయంపేట : జీవితంలో నేత్రాల సంరక్షణ కీలకమని సర్పంచ్ కందగట్ల రవి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శరత్ మాక్సిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమ నేత్రాలను సంరక్షించుకోవాలని సూచించారు. సుమారు 50 మందికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించగా 22 మందికి శుక్లాలు వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. వారందరికీ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుమన్, నేత్ర వైద్య నిపుణురాలు శ్రీజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా బోధన

ఐనవోలు : విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉన్నతి సాధించడమే లక్ష్యంగా విద్యాబోధన సాగిస్తున్నారంటూ ఉపాధ్యాయులను సర్పంచ్ బరిగెల ఆరోగ్యం అభినందించారు. మండలంలోని ఉడుత గూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్ మీట్‌కు సర్పంచ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెప్పడంతోపాటు ఆటపాటల్లోనూ, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించే, పండుగల విశిష్టతలను తెలిపే కార్యక్రమాలు నిర్వహించడంలో ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. తొలుత ×తొలిమెట్టు¥ కార్యక్రమం, ఎఫ్ఏ-4లో విద్యార్థులు సాధించిన ఫలితాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చుంచుకాల లింగారావు, తల్లిదండ్రులు చిదురాల మమత, తాటికాయల సమత, బరిగెల రాధిక, యాకర ప్రియాంక, చిలుమల యాదమ్మ, గ్యాదర జ్యోతి, తాటికాయల రజిత, మిద్దెపాక ఐలమ్మ, మిద్దెపాక తారమ్మ, ఆకులపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బరిగెల ఆరోగ్యం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ధర్మసాగర్ : మండలంలోని ధర్మపురం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మునిగాల యాకూబ్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి రూ.90 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, విద్యా కమిటీ చైర్మన్ బైరపాక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జోడో యాత్రను విజయవంతం చేయాలి

దామెర : ఈనెల 27న పరకాల నియోజకవర్గంలో టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి తలపెట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యేలా సంబంధిత అధ్యక్షులు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బీరం రజనీకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జన్ను రాంచందర్, సదిరం పోచయ్య, దామెర శంకర్, తోట కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు శనిగరం సుధాకర్, దుర్శెట్టి భిక్షపతి, మహిళా అధ్యక్షురాలు జక్కుల ఇందిర, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి

వ్యక్తి మృతి.. ఆర్ఎంపీపై కేసు

ధర్మసాగర్ : కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తి మృతి చెందగా అతడికి వైద్యం చేసిన ఆర్ఎంపీపై బాధిత కుటుంబీకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని ఉనికిచర్ల గ్రామానికి చెందిన కాగితాల రవీందర్ (46) శనివారం మధ్యాహ్నం కడుపునొప్పితో బాధపడుతూ అతడి సోదరుడి కొడుకు మణికంఠతో కలిసి వైద్యం కోసం గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ దగ్గరికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ రెండు ఇంజక్షన్లు ఇచ్చిన కొద్ది సేపటికే రవీందర్ కింద పడిపోయాడు. అనంతరం ఆర్ఎంపీ డాక్టర్, మణికంఠ కలిసి రవీందర్‌ను హనుమకొండలోని మిత్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ పరిశీలించి పల్స్ లేదని చెప్పడంతో రవీందర్‌ను మణికంఠ, ఆర్ఎంపీ వైద్యుడు కలిసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా అక్కడ వైద్యులు పరీక్షించి రవీందర్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో ఆర్ఎంపీపై రవీందర్ సోదరుడి కొడుకు మణికంఠ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

27న పరకాలలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి కొంరారెడ్డి

పరకాల: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర పరకాల నియోజకవర్గంలో ఈనెల 27 నుంచి ప్రారంభం కానుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి కొంరారెడ్డి తెలిపారు. పరకాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడికూడ మండలంలోని కంఠాత్మకూర్, ధర్మారం, నడికూడ మీదుగా పులిగిల్ల గ్రామానికి చేరుకొని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేస్తారని చెప్పారు. నర్సక్కపల్లె, మల్లక్‌పేటకు చేరుకొని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పరకాలకు చేరుకుంటారని తెలిపారు. బస్టాండ్ ప్రధాన కూడలిలో సభలో ప్రసంగిస్తారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మాజీ జిల్లా కార్యదర్శి ఎండీ రంజాన్ అలీ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్, మాజీ ఎంపీపీ ఓంటేరు రాంమూర్తి, మాజీ సర్పంచ్ నలుబోల కిష్టయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొంరారెడ్డి

ఎన్ని చట్టాలున్నా మహిళలకు రక్షణ కరువు

హన్మకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి సాంబరాజు శ్వేత ఆందోళన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని, సైఫ్‌తో పాటు అతనికి సహకరించిన వారిని శిక్షించాలని కోరారు. హనుమకొండలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. అనంతరం ఐద్వా సౌత్ మండల అధ్యక్షురాలు బూడిద రాధ, కార్యదర్శి శ్వేత మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని డాక్టర్ ప్రీతికి న్యాయం చేయాలని కోరారు. వేధింపులు శృతిమించడంతో ప్రిన్సిపాల్ మధుసూదన్, హెచ్‌ఓడీ నాగార్జున రెడ్డికి ప్రీతి ఫిర్యాదు చేసినా వారు స్పందించకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. సైఫ్ డిగ్రీ రద్దు చేయాలని, ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుకర్ణ, విజయ, రాణి, ప్రేమలత, స్రవంతి, కవిత, సుజాత, లక్ష్మి, యశోద పాల్గొన్నారు.

ఏకశిల పార్కు అభివృద్ధే ధ్యేయం

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహకారంతో పార్కు సిబ్బంది సంక్షేమంతోపాటు పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో ఏకశిల చిల్డ్రన్స్ పార్కును మరింతగా అభివృద్ధి చేస్తానని పార్కు నిర్వాహకుడు తీగల శ్రీధర్‌గౌడ్ అన్నారు. ఖిలా వరంగల్ మధ్యకోటలో ఏకశిల చిల్డ్రన్ పార్కులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 12న పార్కు నిర్వహణకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పర్మిషన్ ఇచ్చిందని చెప్పారు. ఏడాదికి రూ.18 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. పార్కులో పనిచేసే 11 మంది సిబ్బందికి సరైన వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని వివరించారు. కొంతమంది చేసే అసత్య ఆరోపణలను నమ్మకూడదని కోరారు. ఈ సమావేశంలో గండ్రాతి రమేష్, బైరబోయిన నాగరాజు, అజ్మల్ సోహేల్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం

భీమదేవరపల్లి : జీవితంలో విద్యార్థి దశ కీలకమని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ పీవీ.మదన్‌మోహన్ తెలిపారు. మండలంలోని వంగర గ్రామంలోని పీవీ రంగారావు బాలికల గురుకుల పాఠశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీవీ.మదన్‌మోహన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల, గ్రామ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేసేలా ప్రణాళికాయుతంగా విద్యారంగంలో రాణించాలని సూచించారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పేద విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో తొలిసారిగా నల్గొండ జిల్లాలోని సర్వేల్‌లో ఆశ్రమ పాఠశాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. అనంతరం పీవీ.మదన్‌మోహన్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీవీ.కిరణ్, ప్రిన్సిపాల్ సురేఖ, పేరేంట్స్ కమిటీ చైర్మన్ అనపురం రమేష్, భార్గవి, ధర్మ తదితరులు పాల్గొన్నారు.



మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

త్రోబాల్ గోల్డ్ మెడలిస్ట్‌కు సన్మానం

ఎల్కతుర్తి : మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన పెండ్యాల నితీష్ ప్రపంచస్థాయి పారా త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి మండల కేంద్రానికి చేరుకోగా సామాజిక సేవకురాలు మంజులరెడ్డి, గ్రామస్తులు శనివారం గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుంచి గోపాల్‌పూర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నితీష్ గోపాల్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో 2017-18లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జాతీయ పారా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ త్రోబాల్ పోటీలో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 23న నేపాల్‌లో జరిగిన ప్రపంచ స్థాయి త్రోబాల్ పోటీకి ఎంపికై ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. అనంతరం తొలిసారిగా మండల కేంద్రానికి చేరుకోవడంతో గ్రామస్తులు, సామాజిక సేవకురాలు మంజులరెడ్డి ఆయనకు గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. నితీష్ ప్రస్తుతం హన్మకొండలోని శార్వాణీ డిగ్రీ కళాశాలలో బీఏ సెకండియర్ చదువుతున్నాడు. మరిన్ని పతకాలు సాధించి గ్రామ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ నిమ్మల మనోహర్ పాల్గొన్నారు.



నితీష్‌ను సన్మానిస్తున్న మంజులరెడ్డి, తదితరులు

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

- పట్టు పరిశ్రమ శాఖ ఉపసంచాలకుడు మురళీధర్‌రెడ్డి

ఎల్కతుర్తి : మల్బరీ సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని పట్టు పరిశ్రమ శాఖ ఉపసంచాలకుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోపాల్‌పూర్‌లో సరళ సిల్క్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళలకు దారం తీయడంలో మెళకువలు నేర్పించేలా 10 రోజులపాటు చేపట్టిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన 25 మంది మహిళా రైతులకు మురళీధర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. జిల్లాలో రీలింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం తొలిసారి అని చెప్పారు. పట్టు రైతులకు ఇది శుభ పరిణామమని తెలిపారు. మల్బరీ సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. మల్బరీ సాగుకు చీడపీడల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సారంగపాణి, నవీన్‌పాల్‌రెడ్డి, రీలింగ్ యూనిట్ యజమాని బోయినపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మురళీధర్‌రెడ్డి

డ్రైవింగ్‌తో యువతకు మెరుగైన ఉపాధి

శాయంపేట : కారు డ్రైవింగ్ నేర్చుకుంటే యువతకు మెరుగైన ఉపాధి లభిస్తుందని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గోవిందాపూర్, జోగంపల్లి గ్రామాల్లో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్రస్ట్ జనరల్ సెక్రటరీ గండ్ర గౌతంరెడ్డి ట్రస్ట్ ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్టు తెలిపారు. పేదలకు అపన్న హస్తం అందిస్తూ యువతకు మార్గనిర్దేశకుడుగా నిలుస్తున్నారని కొనియాడారు. ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు మాచర్ల మంగమ్మ రవి, వావిలాల వేణుగోపాలప్రసాద్, సర్పంచ్‌లు బైరి శ్రీనివాస్, ఎదుల ప్రమీల, రమేష్, నాయకులు కిష్టయ్య, శ్రావణ్, లక్ష్మణ్, సుమన్, శ్రీనివాస్, పైడి పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

శివాలయ పునర్నిర్మాణ పనులు ముమ్మరం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి పంచకూట శివాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయాన్ని పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో పునరుద్ధరిస్తున్న విషయం తెలిసిందే. ఆలయాన్ని పూర్తిగా రాయితోనే నిర్మిస్తున్నారు. దేశంలోనే అరుదుగా కనిపించే ఈ పంచకూట శివాలయ నిర్మాణ పనులు దాతల సహకారంతో ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే గర్భగుడులు, గోపురాల నిర్మాణం పూర్తి కాగా శనివారం ఆలయ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ సభ్యులు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి మాట్లాడారు. భక్తుల, దాతల సహకారంతో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక విశేషం కలిగిన పంచకూట శివాలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. దాతలు మరింత సహకారం అందించాలని కోరారు.



పనులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మడికొండ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలు, నాయకులకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మరావు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా శ్రీధర్, ధర్మారావు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పానగొటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, బైరి సతీష్, తౌటిరెడ్డి రవీందర్‌రెడ్డి, బైరపాక వెంకటేష్, బుర్ర నరేష్, గడ్డం కిరణ్, పల్లపు యుగేందర్, అశోక్, వల్లెపు రేణుక, పలు బూత్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.